# కుంభకోణం బిందె

వేమొజ్జి పద్మావతి



"మావారు తెచ్చారండీ. ఇది బావుందా?"
అని ప్రక్కింటి లక్ష్మిగారు తెచ్చి చూపించారు బిందె. అందంగా, ముద్దుగా వుంది. నాకెన్నాళ్ళ బట్టో కోరిక- కుంభకోణం బిందె తెచ్చుకోవాలి అని. అయినా ఏం కర్మమో, ఏవన్నీ కుదిరినా అది మాత్రం కుదిరి చావడంలేదు. ఇంకా చెబుతూనేవున్నారు లక్ష్మిగారు- "మా వారికి సెలెక్షన్ బాగా తెలుసండీ. ఇంటికి కావాల్సినవన్నీ వారే తెస్తారు. నాకు ఏ పనీ చెప్పరనుకోండి" అంటూ.

ఎదుటివాళ్ళ అదృష్టానికి సంతోషపడాలో నా కర్మానికి ఏడ్వాలో అర్థం కాలేదు. అందరూ అంటారు- "నీకేవమ్మా, బంగారం లాంటి మొగుడు. ఏంకావాలన్నా మీ యిష్ట ప్రకారం తెచ్చుకోవచ్చు" అని. కానీ అందులో కొరవడిన ఆనందం, తెలియకుండా భర్త తెచ్చే వస్తువు చూశాక, అందులో కలిగే థ్రిల్, అది ఎవరికి చెబితే అర్థమౌతుంది.

"ఈ చీర మావారు తెచ్చారు. ధర నాకు తెలియదమ్మా" అంటూ గొప్పగా చెప్పే వాళ్ళు. "ఈ క్రోటను మొక్క బెంగుళూరునుంచి మావారు ప్రత్యేకంగా తెచ్చారు తెలుసా?" అంటూ గర్వంగా చెప్పేవాళ్ళు. "డ్రెస్సింగ్ టేబులు కావాలండీ అన్నానా? ప్రత్యేకం, మావారు దగ్గరుండి మరీ చేయించారు ఎంతయిందో మరి." అంటూ చెప్పే వాళ్ళు. ఈ మాటలన్నీ వినివిని ఎంత స్నేహితులైనా సరే అందరిమీదా కసి లాంటిది కలిగేది.

నాకు చీర లేకపోతేమానే...."అమ్మాయ్ ప్యాంట్లు వెలిసిపోయినట్టున్నాయే........ అమ్మాయ్ బనీన్లు చిరిగిపోయినట్టున్నాయే" అంటూ వివరాలు తెలిపే యీయన్ని లాగి కూర్చోబెట్టి, ఆ వున్న పొట్టి చొక్కా వెలిసిపోయిన ప్యాంటూ వూడలాక్కొని గోచీపెట్టి మరీ ఆఫీసుకు పంపాలన్నంత కసి, కోపం.

దేవుడి కేడుస్తూ తెచ్చేదాన్ని అన్ని గుడ్డలూ. నాకు కామ ఆయనగారికే. మిగిలిన డబ్బులు యిప్పటోతే, "నాచేతికెందుకూ, నీదగ్గరే వుంచు" అనే ఆయన వంక ఒుంగేలా చూసేదాన్ని "నీవూ తెచ్చుకోకపో మావా చీర" అనలేదని కానీ నేను తెచ్చుకోవడంలో నాకెటూ ఆనందం లేదు అక్క. నేను తెచ్చుకుంటానంటే వద్దనరే అనే బాధ కూడా పైపెచ్చు

ఆ కూర ఎట్టన్నావుందనీ దాన్ని గురించే మనరే కసరరే. విసుక్కోరే. ఎంతో బాగా చేసినకూర బాగుందని మెచ్చుకోరు సరికదా "ఎలా వుందండీ?" అని దాటంత మొహం చేసుకునడుగుతానా, గుండ్రాయంత ముద్దలు చేసుకుని కళ్ళుమూసుకు మరీ మిగుతూ మిడుతూ మింగుతూ, తల పైకి, కిందికి నిలువుగా ఆడిస్తున్న మొగుడి నెత్తిన కాలే కాలే పులుసూ, చారూ కలిపి దిమ్మరిద్దామన్నంత కోపం, బాధ.

హడావిడిగావచ్చారు వారు ఆఫీసునుండి. "ఇదుగో అమ్మాయ్, తిరుపతి వెళ్ళాలి అర్జంటుగా. మా ఓనరు గారు వెళ్ళమన్నారు. రేపు రాత్రికల్లా వచ్చేస్తాను. రెండు జతల గుడ్డలవీ సర్దు" అని పురమాయించి బాత్‌రూంకెళ్ళారు.

బ్రీఫ్ కేసు సర్దుతూ ఆలోచించాను. ఎన్నాళ్ళనుంచో కుంభకోణం బిందె తెచ్చుకోవాలని కోరిక. వారితో చెబితేనో అనుకున్నాను. వారు బాత్ రూంనుంచి రాగానే లాగి కూర్చోబెట్టి దువ్వెన చేతిలోకి తీసుకొని నెత్తినున్న నాలుగు వరకలూ అటూ ఇటూ సర్దుతూ లాలనగా అడిగాను- "ఏమండీ, ఎటూ వెళ్తున్నారు కదా. ఇంతవరకూ మీరుగా ఒక్కవస్తువుకూడా తీసుకురాలేదు కదా. కుంభకోణం బిందె తెచ్చిపెట్టండీ" అంటూ.

"అది ఎట్లా వుంటుందో నాకు తెలవదు కదే" అన్నారు మొహం వేలాడేస్తూ. పోనీ తెచ్చేందుకు సుముఖంగా వున్నారుకదా అనుకుని ప్రక్కనే కూర్చుని వర్ణించడం మొదలెట్టాను.

"కుంభకోణం బిందండీ, అబ్బ! చక్కగా బుజ్జి ముండలాగా ముద్దొస్తుంటుందా. అచ్చంగా ఇత్తడితో తయారుచేస్ వుంటారు. బిందేమో పెద్దదిగా వుంటుందా. మూతి మాత్రం ముద్దొస్తుంటుందండీ. ఎంతో బరువుండదు కూడా. ఓ వందరూపాయలలోపే. ఏవండీ, ప్లీజ్ కుంభకోణం బిందె తెచ్చిపెట్టరూ" అని మురిపిస్తూ అడిగాను-

అన్నీ వివరంగా విని బుద్ధిమంతుల్లా తలాడించారు. తప్పక తెస్తానని తలమీద చెయ్యేసి మరీ ఒట్టేయించుకొని గుమ్మం దాటించాను. ఇహ ఆ నిముషం నుంచే నా ఆరాటం ప్రారంభమైంది. అడిగినవాళ్ళకూ అడగని వాళ్ళకూ వివరించి మరీ చెప్పాను. మావారు తీసుకురాబోయే కుంభకోణంబిందె గురించి.

మర్నాటి దాకా ఆ టెన్షన్ భరించడం నిజంగా బాధాకరమే మరి. కాలింగ్‌బెల్ మోత విని తలుపుతీశాను. రిక్షావాడు బ్రీఫ్ కేసు, ఓ పెద్ద అట్టపెట్టె తీసుకువచ్చి వరండాలో పెట్టాడు. అట్ట పెట్టెచూడగానే అదే కుంభకోణం బిందె అయివుంటుందని మురిసిపోయాను. ఇంట్లోకి వచ్చాక తీరిగ్గా కూచుని మొదలుపెట్టారు....ఎవరెస్ట్ శిఖరం ఎక్కిన టెన్సింగ్ నార్కే కళ్ళల్లో కూడా అంత మెరుపు వుండదేమో.

"అబ్బబ్బ. చచ్చిపోయాననుకో అమ్మాయ్. నీ కుంభకోణం బిందెకోసం తిరగలేక ఎన్ని అంగళ్ళు తిరిగాననుకున్నావ్! నీవు చెప్పినట్లే అంగడివాడికి చెప్పాను. "అయ్యా అచ్చమైన రాగితో చేసింది. బిందె చిన్నదిగా వుంటుంది. మూతి పెద్దదిగా వుంటుంది. అంటూను' వెంటనే తీసిచ్చాడే. ధర కూడా నూటపదే నువ్వన్నట్టు. అబ్బ! నిజంగా నీవన్నట్లు బుజ్జిముండ ముద్దొస్తున్నదే" చెప్పకుపోతున్నారాయన. నివ్వెరపోయాను.

"అచ్చమైన రాగిదా?" "అవునే." "బిందె చిన్నదిగా వుంటుందా?" "అలాగేగా చెప్పేవు" "మూతిమాత్రం పెద్దదా?" "మరి కాదా?" ఆముదం తాగినట్టు ముఖం పెట్టారు. అంత పెద్ద ప్యాకెట్టూ ఆదరాబాదరా విప్పి హనుమంతుడు సంజీవి తెచ్చినట్టు బోలెడు. గడ్డి కాయితాల మధ్యనుంచి తీశాడు బిందె. కాదు చెంబు. ఏడవాలో, నవ్వాలో అర్థంకాలేదు!

నేను ఇత్తడిదన్నానా, వారు రాగిదనడిగారు. నేను బిందె పెద్దదని చెప్పానా, వారు బిందె చిన్నదనడిగారు. నేను మూతి చిన్నదని చెప్పానా. వారు మూతి పెద్దదనడిగారు. ఇదేనండీ కుంభకోణం బిందె అని యిచ్చార్ట. ఈయనగారు చెవలాయ అని వాడు తేలిగ్గా కనుక్కున్నట్టున్నాడు మరి.

"అది నాకు నీళ్ళు పోసుకుందుకు పనికి రాదే—" అన్నాను. "మరేం చేస్తావు?" అన్నారు. "ఎటూ హరిదాసులు ఇలాంటివే నెత్తిన పెట్టుకొని వస్తారుగా బిక్షానికి. మీలాంటివాళ్ళతో వేగే బదులు అదే నయం. నేనూ ఇది నెత్తినపెట్టుకొని హరిదాసుల్లాగా చిరతలు తీసుకు చిందులు తొక్కుతూ వెళతాను వూళ్ళోకి!" రుసరుస లాడుతూ అన్నాను.

బిక్క మొహం వేసుకు ప్రతిమాల్తూ అన్నారు- "అందుకేరా, నాకేం తెలీదు. నీవే తెచ్చుకోవే అనేది. పోనీ మన ఇంట్లో రోజెస్ పూస్తాయిగా కొమ్మలు కత్తిరించి ఇందులో పెట్టుకుంటే ఫ్లవర్‌వాజ్‌లాగ బాగా వుండదూ?" బాగా వుండదా అన్న అనుమానం. చెప్పిన పని చెయ్యలేదనే బాధ నేను తిడతానో, కొడతానో అన్నట్టు భయం ఆ కళ్ళల్లో కనుపించి జాలేసింది!

పాపం పిచ్చిమారాజు. ఇంకెప్పుడూ ఏమీ చెప్పకూడదు అనుకొని చెంబుచుట్టూ వున్న వారి చేతుల్ని తీసి నా మెడచుట్టూ వేసుకున్నాను. చిన్నపిల్లాడిలా అతుక్కుపోయారు. ఇన్ని చెప్పానేగానీ ఆ బిందె ఏ సైజులో వుంటుందో చెప్పకపోవడం నా తప్పే మరి. ●




# మినీకథ

యూనివర్సిటీలో ఫైనలియర్ పరీక్షలైపోయాయి.

హాస్టల్లో తన రూంను ఖాళీచేసి లగేజ్ తీసుకొని యింటికొచ్చేశాడు హరి. హరి శెలవుల్లో యింటికొస్తే.... ఇంట్లో నానా హంగామా చేసేవాడు. చిన్నపిల్లాడిలా గెంతేవాడు. చెల్లెలుతో పోట్లాడేవాడు. హరి ఇంట్లో వుంటే ఎంతో సందడిగా వుండేది. కానీ యిప్పుడు హరి ఇంట్లో ముభావంగా వుంటున్నాడు. ఎవరితోనూ ఎక్కువగా మాట్లాడడం లేదు. విషయం ఏమిటో ఎవరికీ అర్థంకావడం లేదు. వాళ్ళమ్మ, చెల్లెలు ఎంత అడిగినా.... హరి తన మౌనానికి కారణం చెప్పడం లేదు. వాళ్ళమ్మ కొడుకు వైనం చూసి దిగులు పెట్టుకొంది.

హరి, మురళి యిద్దరూ హాస్టల్లో రూంమేట్స్. ఇద్దరూ ఒకేక్లాసు. ఇద్దరూ చదువులో చాలా తెలివైన వాళ్ళు. వాళ్ళిద్దరి మీదా ప్రొఫెసర్‌కు మంచి అభిప్రాయం వుంది. ఎం ఏ. ఫస్టియర్లో యిద్దరూ పోటీలుపడి చదివారు. ఫలితంగా మురళికి యూనివర్సిటీ ఫస్ట్ రాంక్. హరికి సెకండ్ రాంక్ వచ్చింది. హరికంటే ఒకే ఒక శాతం మార్కులు అంటే కేవలం నాలుగు మార్కులు మురళికి ఎక్కువగా వచ్చాయి. అప్పుడు హరి ఎంతో అవమానంగా ఫీలయ్యాడు. తన క్లాస్ అమ్మాయిల దగ్గర.... డిపార్ట్‌మెంట్ లెక్చరర్స్ దగ్గర తన ప్రిస్టేజి నిలుపుకోవాలనే పట్టుదలతో హరి ఎంతో కష్టపడి.... ఫైనలియర్ పరీక్షలకు ప్రిపేరయ్యాడు. ఫైనల్లో మురళికన్నా మంచి మార్కులు తెచ్చుకొంటే.... ఫస్ట రాంక్ తనకే వస్తుందని హరి ఆశ.

కానీ.... ఫైనల్లో ఆఖరి పరీక్ష బాగా రాయలేకపోయాడు హరి. క్వెశ్చెన్ పేపర్ చాలా కష్టంగా వచ్చింది. ఒక్క మురళితప్ప ఇంకెవరూ ఆ పేపర్ సరిగ్గా రాయలేదు. తనకు రాంక్ రాదు. డిపార్ట్‌మెంట్‌లోనూ....క్లాస్ అమ్మాయిల దగ్గర తన పరువు పోతుంది. తనకు రాంక్ వస్తుందని అందరూ అనుకొంటున్నారు. తనకు ఎటూ రాదు. ఎందుకంటే ఆ పేపర్లో మురళికి తనకంటే పదిహేను మార్కులైనా ఎక్కువ వస్తాయి.

ఈ విషయమే హరిని కృంగదీస్తోంది. తలెత్తుకొని తను డిపార్ట్‌మెంట్‌కు ఎలా పోవాలి అనేదే హరి బాధ. నిజానికి హరికి అసలు డిగ్రీ అవసరంలేదు. అతడు లక్షాధికారి బిడ్డ తల్లి కడుపులోని పిల్లకులాగా అతనికేమీ తక్కువలేదు. వాళ్ళకు డబ్బు. చదువు. పలుకుబడి. భూములు. కంపెనీలలో షేర్స్ అన్నీ ఎక్కువగానే వున్నాయి. కానీ....హరి రూంమేట్ మురళి చాలా పేదవాడు. ఎం.ఏ.లో ఫస్టరాంక్ వస్తే ఫెలోషిప్ వస్తుంది. కనుక రీసెర్చి చెయ్యవచ్చు. పి హెచ్‌డి. డిగ్రీ సంపాదిస్తే.... ఉద్యోగం- దానంతట అదే వస్తుంది. ఉద్యోగం వస్తే తనకేమీ కష్టాలుండవు. ఈ ఆలోచనతోనే ఫస్ట రాంక్ కోసం రాత్రింబవళ్ళు కష్టపడి చదివాడు మురళి.

హరి ఇంట్లో యింకా ముభావంగానే ఉండటం చూసి ఓరోజు వాళ్ళనాన్న రాఘవరావు విషయం ఏమిటని అడిగాడు కొడుకును. హరి స్వతహాగా భయస్తుడు. ఎం. ఏ. లో ఉన్నప్పుడు ఏదైనా "సెమినార్"లో స్టేజి ఎక్కితే అతడికి వణుకు పుట్టేది. ఏదైనా చెడు పని చేయాలంటే.... ఆ ఆలోచన వచ్చినప్పటినుంచి.... అతనికి గుండెలు దడదడలాడేవి. రాఘవరావు తండ్రి అయినా.... అతడిని చూస్తే హరికి చాలా భయం. తను బాధపడుతున్న విషయం గురించి తండ్రికి మెల్లగా చెప్పేడు హరి.

"ఓరి పిచ్చి సన్నాసీ! ఈమాత్రానికేనా నువ్వు దిగులుపడి కూర్చొంది? అనవసరంగా బెంగపెట్టుకోకు. నీ తండ్రికి ఎంత పలుకుబడి ఉందో నీకు తెలుసు గనుక ఎం. ఏ. లో యూనివర్సిటీ ఫస్ట రాంక్ నీకే